బాల బండారం

# అల్లెం తినే అల్లుడి కథ

బండారు రామ్మోహన్ రావు

రాయలసీమ కుటుంబాలలో– కొత్తగా పెళ్ళైన కూతురు, అల్లుణ్ణి అత్త వారింటికి తీసుకొచ్చి, ఆరు నెలలు ఉంచుకొనే ఒక ఆచారం ఉంది. దీనినే అక్కడ అల్లునికి 'అల్లెం పెట్టడం' అంటారు. కొత్త అల్లునికి పుష్టికరమయిన ఆహారాన్ని ఇచ్చి బాగా మేపితే కూతురి కడుపున ఆరోగ్యకరమైన పిల్లలు పుడతారని వాళ్ళ నమ్మకం.

ఆ వూళ్లో సూర్యకాంతంలాంటి అత్త, రాజబాబులాంటి అల్లుడు ఉన్నారు. అత్తేమో పిసినారి, ఇంట్లో వడ్లు గుమ్మిలోనే ఉండాలి, బిడ్డలు దుద్దేల్లాగాపుట్టాలి– అనే రకం ఆమెది. ఈ రెండిటికి పొసగదు కదా! కానీ కలిపిచూద్దాం అనుకొంది అత్త. అల్లెం తినే అల్లుడు రానే వచ్చాడు. రాయలసీమలో సంప్రదాయ ఇళ్ళలో మధ్య హాల్లో కూర్చుంటే వీధిలోదాకా కనిపించేటట్లు తలుపులు వరసగా ఉంటాయి. ప్రతి రోజు అత్తగారు అల్లుడికి మధ్య హాల్లో కుర్చీ వేసిటేబుల్ మీద పెద్ద పళ్ళెం పెట్టేది. అందులో చిన్న కజ్జి కాయ వడ్డించేది. ఉట్టిమీద ఉన్న నెయ్యి దుత్తను తీసుకొని వీధిలో పోతున్న వాళ్లకి కనిపించేలా అల్లుడి పళ్ళెంలో బోర్లించేది. వీధిలో వచ్చే పోయేవారంతా అబ్బ ఎంత మంచి అత్త, అల్లుడికి మొత్తం నెయ్యంతా వడ్డిస్తోందే అనుకొనేవారు. కానీ అల్లుడికి అసలు కష్టం తెలుసు. చలికాలంలో నెయ్యి గడ్డకట్టి ఉంటుంది కదా, దాన్ని ఎంత బోర్లించినా ఒక్క చుక్క కూడా పడేది కాదు. రానురాను తీసికట్టు నాగంభోట్లు లాగా అల్లుడు అత్త పిసినారి తనానికి బలైపోసాగాడు. అత్త పెట్టా పెట్టదు అడుక్కు తినానివ్వదు అన్నట్టు ఈ కష్టం ఎవరితో చెప్పుకోలేక అల్లుడు కుమిలిపోయేవాడు.

అల్లెం తినే అల్లుడు అత్తవారింటికి వచ్చి నెల అయిపోయింది. దుక్కలా ఉన్న అల్లుడు అత్త పిసినారితనంతో మేకులా సన్నబడి పోయాడు. అల్లుడికి అత్తవారి వూళ్ళో మెల్లమెల్లగా స్నేహితులు తయారయ్యారు. బజారులో టీ తాగుతూ వారితో సరదాగా మాట్లాడుతూంటే ఒక స్నేహితుడు, 'ఏమిరా, దుక్కలా ఉండేవాడివి– బక్కగా అయ్యేవేమని అడిగాడు. అప్పుడు

అల్లుడు భోరుమని తన కష్టాలు స్నేహితులకి చెప్పుకొన్నాడు. పిసినారి అత్త పనిపట్టాలంటే ఆమెకు తగిన బుద్ధి చెప్పాలని స్నేహితులు అల్లుడికి ఒక సలహా ఇచ్చారు. అల్లుడది తుచ తప్పక పాటించాడు.

ఆ రోజు కూడా అత్త అల్లుడికి భోజనం వడ్డించింది. భోజనం అంటే కజ్జికాయే! ఎప్పటిలాగే నెయ్యి దుత్తని తీసుకొచ్చి అల్లుడి కంచంలో బోర్లిస్తే దుత్తలో ఉన్న నెయ్యంతా అల్లుడి కంచంలో పడిపోయింది. అప్పుడు అర్ధమయింది అత్తకి అల్లుడు తెలివి మీరిపోయాడని! తన ఆటలు ఇక సాగవని గుర్తించి- తెల్లవారినుండి అల్లుడికి షడ్రసోపేతమయిన భోజనంతో పాటు తిన్నంత నెయ్యిని వడ్డించి పిసినారి అత్త కాస్తా చేతికి ఎముకలేని అన్నపూర్ణగా మారింది.

ఇంతకీ అల్లుడు ఏమి చేసాడో తెలుసా? ప్రతిరోజు ఉట్టిమీద పెట్టే నెయ్యి దుత్తని ఆరోజు అత్తకి తెలియకుండా ఒక నిమిషం పాటు నిప్పులమీద పెట్టి మళ్లీ ఉట్టిమీద పెట్టేసాడు. అది తెలియని అత్త, అల్లుడికి ఎప్పటిలాగే నెయ్యి వడ్డించడం, అది కరిగిన నెయ్యి కనుక మొత్తంగా అల్లుడి కంచంలో పడిపోవడం జరిగింది.

మన దేశంలో పిసినారి అత్తలాంటి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్థానిక ప్రభుత్వాలయిన గ్రామపంచాయితీ, మండల పరిషత్, జిల్లా పరిషత్‌లను కష్టపెడు తున్నాయి. రాజ్యాంగపరంగా దక్కాల్సిన అధికారాలను వాళ్లకు దఖలు పరచడం లేదు. ఎప్పటికప్పుడు 73,74 వ రాజ్యాంగసవరణ ప్రకారం స్థానిక ప్రభుత్వాలకి అధికారాలని ఇచ్చేవారమనీ, ఇంకా ఇస్తున్నామనీ బుకాయిస్తున్నారు. ఈ అధికారాలు, విధులు, నిధులు దక్కాల్సింది స్థానికప్రభుత్వాలకు. కానీ ఆ అధికారాలని ఇవ్వకుండా మోసం చేస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకి అల్లెం తినే అల్లుడిలాగా బుద్ధి చెప్పాలి. పార్టీలకు, పదవులకు అతీతంగా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలకు 'సెగ' పెట్టాలి. అప్పుడే ఈ ప్రభుత్వాలు దిగివచ్చి అధికార వికేంద్రీకరణ సత్రాతాన్ని పాటిస్తాయి. ఇంటిముందు పాలన, కంటిముందు ప్రభుత్వాన్ని అందిస్తాయి. మనం అమాయకంగా ఉన్నంత కాలం అత్త చేతిలో అల్లుడు మోసపోయినట్లు అవుతుంది. అదే తెలివితో ఆలోచించి అధికారం అనే నెయ్యి ప్రజోపయోగం కోసం వినియోగించాలి. ప్రజలను కలుపుకొని స్థానిక ప్రభుత్వాల సాధికారిక ఉద్యమం చెయ్యాలి. అప్పుడే ప్రజలకి అసలయిన యజ్ఞఫలాలు అందుతాయి.

---()---